క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి విరాళాల అందజేత



సుబ్రమణ్య స్వామి ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న దాతలు.

కొయ్యలగూడెం: నూతనంగా నిర్మిస్తున్న శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి భక్తులు ఆదివారం విరాళాలు సమర్పించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు తాడికొండ మురళీకృష్ణ, గ్రామ పురోహితులు, ఆలయ ప్రధాన అర్చకుడు అనిపెద్ది వెంకట నరసింహ శర్మల సమక్షంలో ఆలయ నిర్మాణ ప్రాంతం వద్ద విరాళాలను అందించారు. కొయ్యలగూడేనికి చెందిన రేలంగి నాగ మురళీకృష్ణ, శివప్రసాద్ బ్రదర్స్ రూ.50 వేలు, వైవీవీఎస్ శివ కృష్ణ ప్రసాద్, (ఏలూరు) రూ.10,116, కానుమిల్లి అరుణ్ కుమార్ చౌదరి రూ. 5,116 విరాళం అందజేశారు. గౌరవాధ్యక్షులు, సభ్యులు మేకల అన్నవరం, మంచాల వెంకయ్య నాయుడు, చోడిపిండి సుబ్రహ్మణ్యం, ఐలూరి విశ్వనాథ శర్మ, మట్టా శ్రీనివాస్, రావూరి మదన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్రామ సభలు

దెందులూరు: కొవ్వలి కో–ఆపరేటివ్ సొసైటీ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు గ్రామసభ నిర్వహిస్తామని మత్స్యశాఖ మండల అధికారి సతీష్ తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథిగా మత్స్యశాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ రాజ్ కుమార్ విచ్చేస్తారన్నారు. అనంతరం దోసపాడు, పోతునూరు గ్రామాల్లో గ్రామసభలు జరుగుతాయని అన్నారు.ఆక్వారైతులు గ్రామ ప్రజలు సమావేశం హాజరు కావాలని ఆయన కోరారు.

పేదలకు ఇళ్లు దక్కే వరకూ పోరాటం

ఏలూరు (టూటౌన్): సీపీఐ ఏలూరు ఏరియా నూతన సమితి సమావేశం కురెళ్ళ వరప్రసాద్ అధ్యక్షతన ఆర్ఆర్‌పేట, స్ఫూర్తి భవన్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ మాట్లాడుతూ ఏలూరు జిల్లాకు కేంద్రంగా, కార్పొరేషన్ అంటూ పేరుకే గాని ఏలూరులో ప్రజలకు ఇప్పటికీ పరిష్కారం కాని సమస్యలు అనేకం ఉన్నాయని తెలిపారు. పెరుగుతున్న ఏలూరు ఏరియా జనాభాకు అనుగుణంగా ప్రజల అవసరాలని తీర్చాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని గుర్తు చేశారు. సొంత ఇల్లు, తాగునీరు, విద్యా, వైద్యం మురికి వాడల్లో నివసించే ప్రజల కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. ఏలూరు ఏరియా నూతన సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ మాట్లాడుతూ పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు గ్రామాల్లో మూడు సెంట్ల ఇటి స్థలం స్థలం ఇవ్వాలని, టిడ్కో ఇళ్లకు మౌలిక వసతులు కల్పించి తక్షణమే లబ్ధిదారులకు అందించాలని కోరారు. సమావేశంలో సీపీఐ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఏలూరు (టూటౌన్): సీపీఐ ఏలూరు ఏరియా సమితి కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ మాట్లాడుతూ శనివారం సమితి మహాసభలు నిర్వహించామన్నారు. నూతన కార్యవర్గంలో ఏలూరు ఏరియా సమితి కార్యదర్శిగా ఉప్పులూరి హేమ శంకర్, సహాయ కార్యదర్శులుగా, కుర్రెళ్ల వరప్రసాద్, అడ్డగర్ల లక్ష్మీ ఇందిరా, మావూరి విజయ, సాయన అభిలాష్ కుమార్, గొర్లి స్వాతి, కొల్లూరి సుధారాణి, 19 మంది కౌన్సిల్ సభ్యులు, ఇద్దరు ప్రత్యేక ఆహ్వానితులు ఎన్నికైనట్లు తెలిపారు.

మున్సిపల్ ఉద్యోగులకు బకాయిలు చెల్లించాలి

ఏలూరు (టూటౌన్): ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ పారిశుధ్య విభాగంలో పని చేస్తున్న పర్మినెంట్ ఉద్యోగులకు రావలసిన ఇంక్రిమెంట్లు, మెడికల్ బిల్లులు, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ బిల్లులు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ డిమాండ్ చేసింది. ఆదివారం స్థానిక స్ఫూర్తి భవనంలో మున్సిపల్ ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ డాంగే, ఏఐటీయూసీ జిల్లా నాయకులు పి.కిషోర్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బజంత్రీ శ్రీనివాస్ మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్‌లో పారిశుధ్య విభాగంలో పని చేస్తున్న 140 మంది పర్మినెంట్ ఉద్యోగులకు 3 సంవత్సరాల నుంచి రావలసిన బకాయిలు ఉన్నాయన్నారు. వీరిలో చాలా మందికి మూడు సంవత్సరాల నుంచి ఇంక్రిమెంట్లు, స్పెషల్ ఇంక్రిమెంట్లు (6,12,18,24), బకాయిలు, 9 నెలల నుంచి మెడికల్ బిల్లులు, గత రెండున్నర సంవత్సరాల నుంచి చనిపోయిన, రిటైర్‌మెంట్ అయిన వారికి రావలసిన లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ బిల్లులు బకాయిలు చెల్లించడం లేదన్నారు. ఉద్యోగులు వారికి రావలసిన బకాయి బిల్లుల కోసం ఆఫీస్ చుట్టూ పదేపదే తిరుగుతున్నా సాంకేతిక కారణాలు చెబుతూ చెల్లించడం లేదన్నారు. కాబట్టి పారిశుధ్య ఉద్యోగులకు రావలసిన బకాయి బిల్లులు వెంటనే క్లియర్ చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎలగాడ దుర్గారావు , ఏఐటీయూసీ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు దొడ్డికర్ల నాగబాబు, వై.ప్రసాద్, కె.నాగేంద్ర, బొచ్చ శంకర్, బంగారు లక్ష్మి, మాడుగుల భవాని, బంగారం అంకమ్మ, బంగారు సురేష్, పొద్దుటూరు సురేష్, బంగారు దుర్గా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు ఇలా.. ప్రయాణమెలా?

- వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు
- ప్రయాణీకుల అవస్థలు



చింతలపూడి -సత్తుపల్లి రహదారిలో ఏసీ అగ్రహారం వద్ద పరిస్థితి ఇలా

చింతలపూడి: నియోజకవర్గంలో పలు రహదారుల పరిస్థితి అధ్వానంగా మారింది. ప్రధాన రహదారులతో పాటు గ్రామీణ రహదారులు సైతం ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారాయి. ఇటీవల అల్పపీడనాలు, రుతుపవనాల ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారులు కూడా గోతులు పడి ప్రయాణికులకు సంకటంగా మారాయి. నియోజకవర్గంలో 284 కిలో మీటర్ల ఆర్ అండ్ బీ రహదారులు, 555 కిలో మీటర్ల మేర పంచాయితీ రాజ్ రహదారులు ఉన్నట్లు అంచనా. శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో రహదారులపై గోతుల్లో నీరు చేరి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చింతలపూడి మండలంలో 34.2 మి.మీటర్లు, జంగారెడ్డిగూడెం మండలంలో 31.8 మి.మీటర్లు, లింగపాలెం మండలంలో 27.2 మి.మీటర్లు, కామవరపుకోట మండలంలో 48.2 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది

గోతులతో అవస్థలు

ముఖ్యంగా చింతలపూడి నుంచి గురుభట్లగూడెం రోడ్డు మల్లాయగూడెం వరకు దెబ్బతింది. జీలకర్రగూడెం నుంచి కామవరపుకోట వరకు పెద్ద పెద్ద గోతులు పడి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ఈ రహదారిలో వర్షపు నీటితో నిండిన గోతుల్లో వాహనాలు దిగబడి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నట్లు వాపోతున్నారు. చింతలపూడి నుండి వయా టి.నరసాపురం, జంగారెడ్డిగూడెం వెళ్లే ప్రయాణికుల బాధలు వర్ణనాతీతం. గోతులు తప్ప అసలు రోడ్డే కనపడడం లేదని వాపోతున్నారు. చింతలపూడి నుంచి సుమారు 8 కిలోమీటర్ల రహదారి అభివృద్ధి చేస్తే ఈ సమస్య పరిష్కారమవుతుందని ప్రయాణికులు చెబుతున్నారు. నిత్యం అధికారులు, ప్రజా ప్రతినిధులు తిరిగే రహదారి కావడంతో తక్షణం రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతున్నారు.



వర్షాలకు జీబీజీ రోడ్డు దుస్థితి



ధ్వంసమైన సమ్మెటవారిగూడెం వద్ద రహదారి



చింతలపూడి నుండి నాగిరెడ్డిగూడెం వెళ్లే రహగదారి ఇలా

నడిగూడెంలో జోరుగా పేకాట?

కుక్కునూరు: మండల శివారు ప్రాంతమైన శ్రీధరవేలేరు పంచాయతీ పరిధిలోని నడిగూడెం అటవీ ప్రాంతంలో పేకాట జోరుగా సాగుతున్నట్టు సమాచారం. గతంలో ఈ ప్రాంతం కోడిపందేలు, పేకాటకు అడ్డాగా ఉండేది. కాగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత పోలీసులు జూద క్రీడలపై ఉక్కుపాదం మోపారు. అయితే ప్రభుత్వం మారడంతో మళ్లీ పేకాటరాయుళ్ల చూపు మండలంపై పడినట్టు తెలుస్తుంది. అంతేకాక మండలంలోని శ్రీధరవేలేరు అటవీప్రాంతాన్ని అడ్డాగా చేసుకోని కొన్ని రోజులుగా గుట్టుచప్పుడు కాకుండా పేకాట నిర్వహిస్తున్నట్టు తెలుస్తుంది. ఈ ప్రాంతంలో జరిగే పేకాటకు మండలం నుంచే కాక తెలంగాణలోని పలు ప్రాంతాల నుంచి పేకాటరాయుళ్లు వస్తున్నట్టు సమాచారం. ఆదివారం కూడా పేకాట నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు స్థానిక విలేకరులు కవరేజ్‌కు వెళ్తుండగా ఆ విషయం తెలుసుకున్న పేకాటరాయుళ్లు పారిపోయినట్టు సమాచారం. కాగా కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత మరల పేకాటరాయుళ్ల చూపు మండలంపై పడిందని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు.

పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ బోదుల స్వరూప్

దెందులూరు: పాఠ్య, నోట్ పుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పోతునూరు గ్రామ సర్పంచ్ బోదుల స్వరూప్ అన్నారు. పోతునూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలను స్కూల్ కమిటీ చైర్మన్ లంక కొండ మాజీ వార్డ్ మెంబర్ బెజవాడ వెంకన్న గొల్లపల్లి ఫణీంద్ర ఉపాధ్యాయులతో కలిసి అందజేశారు.

అలరించిన అన్నమాచార్య సంకీర్తనలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామకృష్ణాపురంలోని సాహిత్య మండలి హాలులో నగరానికి చెందిన గరికపాటి ఆర్ట్స్ థియేటర్స్ ఆధ్వర్యంలో 275వ కార్యక్రమంగా ఆదివారం ముక్కామల శ్రీవల్లిచే నిర్వహించిన అన్నమాచార్య సంకీర్తనలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. అనంతరం నిర్వహించిన సభకు గరికపాటి ఆర్ట్స్ థియేటర్స్ డైరెక్టర్ గరికపాటి కాళిదాసు అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా మల్లాది నారాయణ శర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ శాస్త్రీయ విద్వాంసురాలు ముక్కామల భామామణికి ఆత్మీయ సత్కారం చేశారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు (టూటౌన్): పోలవరం ప్రాజెక్టు ప్రారంభించి 21 సంవత్సరాలు కావస్తున్నా నిర్వాసితుల సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిందని రైతు కూలీ సంఘం (ఏపీ) జిల్లా కార్యదర్శి షేక్ భాషా పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. నిర్వాసిత కాలనీలన్నీ తక్కువ కూలికి దొరికే లేబర్ అడ్డాలుగా మారాయన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలం కొండ మొదలు పంచాయతీలో గిరిజనుల సాగులో ఉన్న 426 ఎకరాల భూమికి ప్రభుత్వం 2017లో ఒప్పందం చేసుకుందన్నారు. ఈ ఒప్పందాన్ని అమలు చేయలేదని వాపోయారు. కత్తనపల్లి, కొత్తగూడెం గ్రామాలకు చెట్ల నష్ట పరిహారం, ఆర్ అండ్ఆర్, భూమికి భూమి ఇవేవీ ఇవ్వలేదన్నారు. ఎన్నో దఫాలు ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకొచ్చినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఈ సమస్యలపై రంపచోడవరం ఐటీడీఏ ఆఫీస్ వద్ద సోమవారం కొండ మొదలు సర్పంచ్, ఏజెన్సీ గిరిజన సంఘం నాయకులు వేట్ల విజయ దీక్షను ప్రారంభిస్తారన్నారు.

‘యువత పోరు’ను విజయవంతం చేయాలి

మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



సీతంపేటలో యువత పోరు పోస్టర్స్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఏలూరులో నిర్వహించే యువత పోరును విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పిలుపు ఇచ్చారు. ఆదివారం సీతంపేట గ్రామంలో నియోజకవర్గ యూత్ నాయకులు తోట జయబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన యువత పోరు పోస్టర్స్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నిరుద్యోగుల పక్షాన నిలుస్తూ బూటకపు కూటమి నిరుద్యోగులకు ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్‌తో యువత పోరు చేపట్టినట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు కలెక్టరేట్ కార్యాలయాల వద్ద నిర్వహించే మహా ధర్నాకు వైఎస్సార్‌సీపీ శ్రేణులతో సహా నిరుద్యోగులంతా తరలిరావాలని కోరారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా నిరుద్యోగ యువతకు నెలకు రూ.3వేల భృతి ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. నియోజకవర్గం నుండి ఐదు వందల మందికి పైగా నిరుద్యోగులతో మండలంలోని ఆరిపాటి(కనకాద్రి పురం) నుంచి తరలివెళుతున్నామని ఉదయం ఏడు గంటలకు ఏడు మండలాలకు చెందిన యువత ఆరిపాటికి చేరుకోవాలని మండల కన్వీనర్ తుమ్మలపల్లి గంగరాజు సూచించారు. జిల్లా అధికార ప్రతినిధి దాసరి విష్ణు, మండల కన్వీనర్ తుమ్మలపల్లి గంగరాజు, ఎంపీపీ గంజిమాల రామారావు, కొప్పుల వెంకటేశ్వరరావు, తోటకూర శ్రీను, మల్లెపూడి ప్రవీణ్, రామిని సుబ్రహ్మణ్యం, కేదాసు శ్రీనివాసరావు, పిడక నరేష్,మధ్యాహ్నపు యేసు, దూలపల్లి కాంతారావు, కంభంపాటి బుజ్జిబాబు, బ్రహ్మన్న, పాముల నాగముని స్వామి, ఏలేటి చంద్రం, ఎస్‌కే బాజీ, కాటుబోయిన సురేషు, ఎం.సతీష్, సొంగ రాకేష్, చిడిపి రవి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కథలతో బహుళ ప్రయోజనాలు



విద్యార్థులకు కథలు చెబుతున్న ఉపాధ్యాయుడు మండే సుధాకర్

భీమడోలు: కథలు చెప్పడం ద్వారా బహుళ ప్రయోజనాలు ఉన్నాయని ఉపాధ్యాయుడు మండే సుధాకర్ అన్నారు. భీమడోలు, పూళ్ల శాఖా గ్రంథాలయాల్లో చదవడం మాకిష్టం కార్యక్రమంలో ఆదివారం కథలు చెప్పడం, వినడం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. భీమడోలు గ్రంథపాలకుడి ఆధ్వర్యంలో పలు పాఠశాలల విద్యార్థులు సామూహిక పుస్తకం పఠనం చేశారు. పలువురు విద్యార్థులు కథలు వివరించారు. ఈ సందర్భంగా మండే సుధాకర్ మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య వినికిడి ద్వారా రైలు ప్రమాదాన్ని ముందుగానే గుర్తించి పెద్ద ముప్పును తప్పించారన్నారు. వినడం ద్వారా వినోదం పంచడానికి, నైతిక విలువలను నేర్పడం, విజ్ఞానాన్ని అందించడం వంటి కార్యక్రమాలతో పాటు ఊహా శక్తి, భాషా నైపుణ్యాలు వృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో గ్రంథ పాలకులు కె.శ్రీనివాస్, డీఎస్‌బీ అమర్‌నాథ్, విద్యార్థులు పాల్గొన్నారు.

వర్షంతో పల్లపు ప్రాంతాలు జలమయం



బీసీ కాలనీలోని డ్రెయిన్ పూడిక తీస్తున్న పారిశుధ్య సిబ్బంది

భీమడోలు: మండ ల వ్యాప్తంగా శనివారం రాత్రి కురి సిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతా లు జలమయమయ్యాయి. మండలంలో 78.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ సీజన్‌లో అతి పెద్ద వర్షం కావడంతో పలు ప్రాంతాలు నీటి మునిగాయి. మండలంలోని భీమడోలు, గుండుగొలను, పూళ్ల, సూరప్పగూడెం, పోలసానిపల్లి, అంబర్‌పేట, ఎంఎంపురంతో పాటు పలు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. పల్లపు కాలనీల్లోని రోడ్లపై నీరు నిలిచింది. దీంతో వాహన చోదకులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. గుండుగొలను బీసీ కాలనీలోని ప్రధాన రోడ్డుపై వర్షపు నీరు భారీగా చేరింది. దీంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నందున గ్రామ పంచాయతీ అధికారులు ఆదివారం స్పందించారు. కార్యదర్శి కేవీ తనూజ ఆధ్వర్యంలో పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది కాలనీలోని మురుగు నీరు కిందకు పారేలా డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరిచారు. దీంతో వర్షపు నీరు కిందకు పారింది.

మురుగునీటితో ముప్పు



బీఎస్ఎన్ఎల్ టవర్ ప్రాంతంలో సీసీ రోడ్డును ముంచెత్తిన మురుగునీరు

కొయ్యలగూడెం: పరింపూడి పంచాయతీ పరిధిలోని బీఎస్ఎన్ఎల్ టవర్ ప్రాంతాన్ని మురుగు నీరు ముంచెత్తుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొయ్యలగూడెం పట్టణంలోని ఎగువన ఉన్న డ్రెయినేజీల నీరు అంతా బీఎస్ఎన్ఎల్ టవర్ వైపు ప్రవహిస్తుండడంతో తమ ప్రాంతం ముంపునకు గురైందన్నారు. దీంతో ఇటీవల నూతనంగా నిర్మించుకున్న సీసీ రోడ్లు సైతం ముంపునకు గురై రాకపోకలు సాగించడానికి వీలు లేకుండా మారాయని వాపోతున్నారు. బీఎస్ఎన్ఎల్ ప్రాంతం ముంపు గురించి అనేక మార్లు సంబంధిత పంచాయతీ శాఖల అధికారులకు ఫిర్యాదు చేసిన సమస్య పరిష్కారం కాలేదు అని ఎంపీటీసీ ఘంటసాల సీనమ్మ పేర్కొన్నారు. సాధారణ రోజులలోనే ముంపు నీరు ఈ విధంగా ఉంటే వర్షాలు పడిన సమయంలో ఏకంగా వరద ప్రవాహం బీఎస్ఎన్ఎల్ ప్రాంతాన్ని ముంచేత్తుతుందన్నారు. మురుగునీరు ఇళ్లలోకి ప్రవహిస్తోందని, విష సర్పాలు, క్రిమి కీటకాలు సంచరిస్తుండడంతో పిల్లలతో ఉంటున్న తాము అంతా భయాందోళనతో గడుపుతున్నామన్నారు. తీవ్రమైన దుర్గంధం వ్యాపించడంతో రోగాలకు గురయ్యామన్నారు. బీఎస్ఎన్ఎల్ ప్రాంతం పంపు సమస్యపై దృష్టి పెట్టి పరిష్కరించాలని స్థానిక ప్రజలు అధికారులను కోరుతున్నారు.

యోగాంధ్ర కాదు..ఉద్యోగాంధ్ర కావాలి



కన్నాపురంలో నిర్వహించిన సీపీఎం శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న నాయకులు

కొయ్యలగూడెం: రాష్ట్రానికి కావాల్సింది యోగాంధ్ర కాదని ఉద్యోగాంధ్ర అని సీపీఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం పేర్కొన్నారు. ఆదివారం కన్నాపురంలో నిర్వహించిన సీపీఎం జిల్లా స్థాయి పార్టీ సభ్యుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలు ప్రజా సమస్యలను పట్టించుకోకుండా యోగా పేరిట దృష్టి మరల్చే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. మతోన్మాద చర్యలతో ప్రజల దృష్టిని పక్కదోవ పట్టించేందుకు కూటమి ప్రభుత్వం యోగాంధ్రాను అడ్డం పెట్టుకుందని, రాష్ట్రంలో ఉద్యోగాంధ్రా కావాలని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగ ఖాళీల భర్తీ, ప్రత్యేక డీఎస్సీ నిర్వహణ వంటి హామీలను కూటమి ప్రభుత్వం మరచిపోయిందని, సూపర్ సిక్స్ వాగ్దానాల అమలులో వెనుకబడిందని సీతారాం ఆరోపించారు. జీవీఎల్ నరసింహారావు మాట్లాడుతూ దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతూ, ఆదానీ, అంబానీలకు కోట్ల రూపాయల రాయితీలు ఇస్తూ, సామాన్య ప్రజలపై పన్నుల భారం మోపుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ, మొడియం నాగమణి, జిల్లా కమిటీ సభ్యులు మానుకొండ జీవరత్నం, గూడెల్లి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

వేగవంతంగా రీ సర్వే పనులు



రీసర్వే పనులు చేస్తున్న సర్వేయర్లు

దెందులూరు: మండలంలో పైలెట్ ప్రాజెక్టు గ్రామాలైన రామారావుగూడెం, ముప్పవరం గ్రామాల్లో రీసర్వే పనులు వేగవంతంగా చేస్తున్నామని తహసీల్దార్ బి.సుమతి అన్నారు. ఆదివారం రీ సర్వే పనులను డిప్యూటీ తహసీల్దార్ రవిచంద్రతో కలిసి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ రవిచంద్ర మాట్లాడుతూ రామారావుగూడెం గ్రామంలో 69 ఎకరాలు, ముప్పవరంలో 397 ఎకరాల్లో సర్వేయర్లు రీసర్వే చేస్తున్నారన్నారు. ప్రాథమిక దశలో భూమిపై హక్కుదారుడు విస్తీర్ణాన్ని నమోదు చేసి రికార్డుల్లో పొందుపరిచే కార్యక్రమం దాదాపు పూర్తికావచ్చిందన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రీసర్వే రైతుల భూ భద్రత కోసం నిర్వహించే శాశ్వత ప్రక్రియ అన్నారు. రైతులందరూ రీసర్వే రెవెన్యూ సిబ్బందికి తమ పూర్తి స్థాయి సహాయ సహకారాలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ హేమమాలిని, విలేజ్ సర్వేయర్లు, వీఆర్‌వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

రేపు సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు

భీమడోలు: ఆధార్ నమోదు, ఆధార్ నవీకరణకు ఈ నెల 24వ తేదీ నుంచి 27వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు మొబైల్ ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతీదేవి తెలిపారు. భీమడోలులో ఆదివారం ఓ పత్రికా ప్రకటనను విడుదల చేశారు. భోగాపురం సచివాలయంలో ఈ నెల 24, 25వ తేదీల్లోనూ భోగాపురం, ఎంఎంపురం, అంబర్‌పేట సచివాలయాల వద్ద, ఈ నెల 26, 27వ తేదీల్లో గుండుగొలను, దుద్దేపూడి, సూరప్పగూడెం సచివాలయాల వద్ద మొబైల్ ఆధార్ క్యాంపు నిర్వహిస్తున్నామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

మురుగు డ్రెయిన్‌ను ప్రక్షాళన చేయాలి



కొల్లేరు ముఖ ద్వారంలో గుర్రపు డెక్కతో నిండిపోయిన తోకలపల్లి మురుగు కోడు

ఉంగుటూరు: కొల్లేరులో మురుగు నీరు, వర్షపు నీరు కలిసే (రామన్నగూడెం) శివారు ప్రాంతమైన తోకలపల్లి కోడు గుర్రపు డెక్కతో నిండిపోయింది. నీరు పారే పరిస్థితి లేదు. డ్రెయినేజీ శాఖ ఇటుపక్క కన్నెత్తి చూడడం లేదు. దీంతో డ్రెయినేజీలో గుర్రపు డెక్క, తూడు అలుముకుంది. సహజంగా ప్రతి ఏడాది వేసవి సమయంలో నీరుపారే పరిస్థితి ఉండదు కనుక డ్రెయిన్లు తవ్వే పనులు చేపడతారు. అలాగే తూడు, గుర్రపు డెక్క తొలగిస్తారు. కాని అలాంటి పనులు ఏవీ ఈ ఏడాది చేపట్టలేదు. తోకలపల్లి మురుగుకోడు ఉంగుటూరు, తాడేపల్లిగూడెం మండలాల్లో మురుగు నీరు, అధిక వర్షాల వరద నీరు లాగే అతి పెద్ద మురుగు డ్రెయిన్. అయితే పంట చేలల్లో మురుగు నీరు కూడా ఈ తోకలపల్లి డ్రెయిన్‌లోకి కలుస్తుంది. అంతే కాదు రైల్వే, జాతీయ రహదారి కింద నుంచి ఉంగుటూరు మండలంలో విస్తరించి ఉన్న ఆరు యూటీ డ్రెయిన్ల ద్వారా మెట్ట ప్రాంతంలో 48 కిలో మీటర్లు క్యాచ్‌మెంట్ ఏరియాలో కురిసిన అధిక వర్షాల నీరు తోకలిపల్లి మురుగుకోడులోకి చేరుతుంది.

ఈ డ్రెయిన్ ద్వారానే వర్షపు నీరు కొల్లేరుకు

ఈ మేజర్ మురుగు కోడు తాడేపల్లిగూడెం మండలం మెట్ట ప్రాంతంలోని పెదతాడేపల్లి వద్ద నుంచి ప్రారంభమైన అజరాల డ్రెయిన్ ఉంగుటూరు మండలం ఉప్పాకపాడు యూటీ వద్ద తోకలిపల్లి మురుగుకోడుగా రూపాంతరం చెంది సుమారు 22 కిలో మీటర్లు ప్రయాణించి రామన్నగూడెం వద్ద కొల్లేరులో ఈ నీరు కలుస్తుంది. ఇంత నీరు లాగే తోకలపల్లి మురుగుకోడులో ఈ ఏడాది తవ్వకం పనులు ఏమీ చేయలేదు. సరికదా కనీసం తూడు, గుర్రపు డెక్క తీయకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధిక వర్షాలు కురిసిన సమయంలో ఈ మేజర్ డ్రెయిన్ ఉగ్రరూపం దాలుస్తుంది. అంచులు తాకుతూ కొల్లేరులోకి నీరు ప్రవహిస్తుంది. ఇంత ప్రాదాన్యత సంతరించుకున్న ఈ డ్రెయిన్ తవ్వకపోవడం కూటమి నాయకుల అలసత్వమని రైతులు చెబుతున్నారు. ఈ డ్రెయిన్‌ను ఆనుకొని వేలాది ఎకరాల పంట పొలాలు ఉన్నాయి. లక్షలాది టన్నులు పండే వరి పంట మురుగు నీరు బాగా పారితేనే ఎటువంటి ముంపునకు గురి కాకుండా వరి పంట చేతికందుతుంది. లేకపోతే అధిక వర్షాల సమయంలో ఈ డ్రెయిన్ లాగకపోతే పంట చేలు మునిగిపోతాయి. గతంలో ఇలాంటి పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి. ఇప్పుడైనా వర్షాలు కురవక ముందే మేజర్ డ్రెయిన్‌ను కనీసం గుర్రపు డెక్క తొలగించి శుభ్ర పరచాలని రైతులు కోరుతున్నారు.